# ఏది న్యాయం?!

చలపతి ఒక్కసారి ఎలా గొప్పవాడైయ్యాడో అర్థం కాలేదు. గ్రాడ్యుయేషన్ అయ్యాక రెండేళ్ళు నిరుద్యోగిగా తిరిగి ఉన్న ఊర్లో కనీసం కూలి కూడా దొరకదని విజయవాడ చేరాడు. కలసి చదువుకోవటం, కలిసి తిరిగేవాళ్ళం. ఆ స్నేహంతోనే చలపతిని కలిసాను. స్నేహితుడిగా ఎంతో గౌరవించాడు. చింపిరిజుట్టు, మాసిన బట్టలతో తిరిగేవాడు, ఇప్పుడు మంచి బట్టలు, కళ్ళద్దాలతో అందంగా నీట్‌గా తయారయ్యాడు. పెద్ద ఆఫీసర్‌లా— ఆ రోజంతా కలిసి తిరిగాం. నిరుత్సాహంగా ఉండే చలపతి ఉత్సాహంగా, చలాకిగా ఉంటున్నాడు. వాడితో కలిసిన దగ్గరనుంచి, తిరుగుతూ మాట్లాడుతున్నానే గానీ, అసలు 'మిస్టరీ' అర్థం కాలేదు. రెండు మూడు సార్లు అడిగి చూసాను, కానీ జవాబు దాటవేస్తుండేవాడు. పోనీ, ఉద్యోగం చేస్తున్నాడంటే ఈ ఆలోచన ఉండక పోను.

విజయవాడంతా సర్దాగా తిరిగాం. గొప్పవాడవడానికి కారణం ఏమిటో తెలుసుకోవాలని నిర్ధారించుకున్నాను. గట్టిగా అడిగాను. మొత్తానికి నిజాన్ని రాబట్ట గలిగాను.

అతడు చెప్తుంటే ఆశ్చర్యంగా వుంది—

'ఉద్యోగ అవకాశాలు', అని పేపరు ప్రకటన ఇస్తాను. "అప్లికేషన్ కోరువారు తగినన్ని స్టాంపులు అంటించిన కవరు, 5/- పోస్టల్ ఆర్డరు పంపగోరుతాం," అని చెప్పి ఓ పేపరు ప్రకటన కూడా చూపించాడు.

"మరి ఇది అన్యాయం కదా! ప్రభుత్వం దృష్టికి వెళితే ఏమవుతావో తెలుసా?!" భయంతో అన్నాను.

"ఏది న్యాయం, ప్రభుత్వం మాత్రం అన్యాయం చేయట్లేదా?! తప్పుడు ప్రకటనలు ఇచ్చి నిరుద్యోగుల డబ్బు గుంజట్లేదా?!" అన్నాడు చలపతి.

"ప్రభుత్వం డబ్బు గుంజట మేమిట్రా?!"

"నీకు తెలీనట్లు మాట్లాడుతావేం?! ఉదాహరణకు గ్రూప్ ఫోర్; విలేజి అసిస్టెంట్లు... లాంటివి...ఇలాంటివి ఎన్నో. వీటి పేరుతో డబ్బు వసూలు చేసి, పరీక్షలు రద్దు చెయ్యడం లేదూ!! ఇది అన్యాయం కాదా! వారు చేసినట్లే నేను కూడాను." సింపుల్‌గా చెప్పాడు.

"అవును నిజమే!" అనుకున్నాను.

—రవి క్రిష్.

# "పాపం! ఓ బిచ్చగత్తె!!"

నే రోజూ! చూస్తున్నానో బిచ్చగత్తెను!
బహుపాట్లు బడే ఓ బిచ్చగత్తెను!
ప్లాటుఫారంపై! పాపం!
అటూ—ఇటూ—గజిబిజిగా!
బహు బిజీగా తిరుగుతూ!
వచ్చే పోయే రైలుబండ్లను!
టి. టి. ఇ. లా తనిఖీ చేస్తూ!
అందర్నీ దేబిరిగా చూస్తూ!
వాళ్ళు తినిపారేసిన ఎంగిలాకులనే
తేరిపార జూస్తూ!
మేకలకు సైతం! అరటి
తొక్కలను అందనీయకుండా!
ఆరగించే "పాపం! ఓ బిచ్చగత్తెను!"
ముళ్ళకంచెలా రేగిన జుట్టు
శరీరాన్ని సాంతం కప్పలేక
నిస్సహాయతను వ్యక్తంజేసే!
ఓ అతుకుల ముతక చీరా
భుజాలపై చిరిగి...
మన స్వాతంత్ర్యపు జండాలా
రెప! రెప! లాడే!
ఓ చింకి జాకెట్టూ!
ఎక్కడో లోతు బావిల్లో!
కదలాడే! నీళ్ళలాంటి!...

—"ప్రవీణ్ సుశ్రీ".